కథ



# నిర్ణయం

వాణిశ్రీ

**ఆ**ఫీసులో కూర్చుని పని చేసుకుంటున్న అరుణ దగ్గరకి కొరియర్ కుర్రాడొచ్చి ఒక కవరు అందించాడు. సంతకం పెట్టించుకొని వెళ్లాడు.

అరుణ కవరు పైన ఫ్రమ్ అడ్రస్ చూసింది. వంశీమోహన్, అని ముంబై అడ్రస్ వుంది.

***డియర్ అరుణ,***

నేనీ మధ్య మన వూరెళ్లాను. అప్పుడు తెలిసింది. నాకు చెన్నకేశవులు చనిపోయాడని. ఐ యామ్ సారీ అరుణా. నీ భర్త ఆఫీసులో నీకు జూనియర్ అసిస్టెంట్ వుద్యోగం ఇచ్చారని మీ అన్నయ్య చెప్పాడు. నీకు నా ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తున్నాను. జరిగిందంతా ఒక పీడ కలగా మర్చిపో. కాలం గడిచేకొద్దీ బాధంతా మర్చిపోయి మామూలుగా వుంటావు. కాలానికి అన్నీ మరిపించే గుణం వుందని అంటారు.

నేను హైదరాబాద్ వచ్చినప్పుడే నిన్ను కలుసుకుంటాను.

ఉంటాను
వంశీమోహన్.

అరుణ కాగితాన్ని కవరులో పెట్టి డ్రాయిర్ సొరుగులో పడేసింది. వంశీమోహన్ గుర్తొచ్చి ఆమెకు కన్నీళ్లొచ్చాయి.

"నువ్వు రావొద్దు వంశీ, హైదరాబాద్ వచ్చినా నా దగ్గరకి రావొద్దు' అనుకుంది.

గుండె బరువెక్కింది.

గొంతులో ఏదో అడ్డుపడ్డట్లయింది. వాటర్ బాటిల్ తీసుకొని నీళ్లు తాగింది.

వంశీని చూసి పదేళ్లయింది. తన పెళ్లికి అతను రాలేదు. అప్పుడతను చావు బతుకుల్లో వున్నాడు. తనతో జీవితాన్ని వూహించుకున్న అతని కల కల్లలయినందుకు తట్టుకోలేకపోయాడు. ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సకాలంలో ఫ్రెండ్స్ అతన్ని కాపాడారు.

తన గుండెరాయి చేసుకొని చెన్నకేశవులుతో తాళి కట్టించుకుంది. తను ఈ పెళ్లి చేసుకోకపోతే తండ్రి పురుగుల మందు తాగి చస్తానన్నాడు. తల్లి గూడా అనుసరిస్తానని బెదిరించింది. కన్నతల్లిదండ్రుల్ని పోగొట్టుకొని తను ప్రేమ పేరుతో వంశీ వెంట వెళ్లిపోతే? జీవితాంతం లేచిపోయిందనే మాయని మచ్చ. తల్లిదండ్రుల్ని పొట్టనపెట్టుకుందనే బంధువుల ఛీత్కారాలు.

ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ఐదేళ్లు వంశీ, తను గాఢంగా ప్రేమించుకున్నారు. ఏం లాభం? అన్ని ప్రేమ కథల్లాగే విఫలమైంది. అసలు విఫలమైన దాన్నే ప్రేమ అంటారేమో?

వంశీకి ఆస్తి లేకపోవడం పెద్ద మైనస్. కనీసం వుద్యోగం లేకపోవడం మరో మైనస్. కులం ఒకటే. మతం ఒకటే. ఊరు ఒకటే. ఇన్ని ఒకట్లు కలిసినా తమను ఒకటి చేయలేకపోయాయి.

తండ్రి పెద్దరికం, మూర్ఖత్వం, అన్నీ తనకే తెలుసుననే అహంకారం ముందు తన ప్రేమ దూదిపింజెలా తేలిపోయింది.

"పేదవాడు ప్రేమించడానికి అర్హుడు కాడేమో?" అని వంశీవాపోయాడు.

నిజమేనేమో?

అందరి ఆడవాళ్లలా తను రాజీపడి చెన్నకేశవుల్ని పెళ్లి చేసుకుంది. హైదరాబాద్‌లో కాపురం. ఇద్దరు పిల్లలు. పెళ్లయి పదేళ్లయింది. చెన్నకేశవుల్ని మాయదారి క్యాన్సర్ పొట్టనపెట్టుకుంది.

"పిల్లల్ని అన్యాయం చేయకు అరుణా!" అని కన్నీళ్లు పెట్టుకున్నాడు చెన్నకేశవులు.

అతని మాటల్లో తనకు ఎన్నో అర్థాలు స్ఫురించాయి.

"అమ్మను బాగా చూసుకో. ఇక నుంచి నీకు అత్త కాదు. అమ్మ. ఏలోటూ రానియ్యకు."

తన కుటుంబం ఏమైపోతుందోననే దిగులుతోనే చెన్నకేశవులు కళ్లు మూశాడు. దిగులు పడడం కంటే అతనేం చేయగలడు?

భర్త ఆఫీసులోనే తను ఉద్యోగంలో చేరింది. ఇప్పుడు తన బాధ్యత ఒకటే పిలల్ని పెంచి పెద్ద చేయాలి. పసిపిల్లలకు తండ్రి లేని లోటు తెలియకుండా తనే తల్లి! తండ్రీ! కావాలి. అంత కంటే ఏం వుంది?

తను వుద్యోగం చేస్తుంటే. అత్త ఇల్లు చూసుకుంటోంది. పిల్లల బాగోగులు అన్నీ ఆమె బాధ్యతగా నిర్వహిస్తోంది.


కాని ఈ లోకం కాంక్రీట్ జంగిల్. అడవిలో వున్న క్రూర మృగాలన్నీ ఇక్కడ మనుషుల రూపంలో వున్నాయి. పెద్ద పులులు, తోడేళ్లు, రేచు కుక్కలు, నక్కలు అన్నీ సందుదొరికితే తనను కబళించడానికి కాచుకుని వున్నాయి.

అరుణ ఆవులా సాధు జంతువు. లేడిపిల్ల లాంటిది. అనుకుంటే తనను నిరంతరం వేటాడుతుంటారు. తన రక్త, మాంసాలు తోడేస్తారు. అందుకే తను సివంగిలా ప్రవర్తిస్తోంది.

ఆఫీసులో మేనేజర్ తనను పిలిచి " నీకు భర్త లేడు. నాకు భార్య లేదు. ఇద్దరం కలిసి వుంది. ఏం? అమెరికాలో సగం మంది అటువంటి జంటలే.'' అన్నాడు.

ఆయనకి ఏభై ఏళ్ల వయసు.

తను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి, ఆఫీసులోనే




చెప్పుతో కొట్టింది.

'కత్తితో పొడికి చంపుతాను' అని కేకలు పెట్టింది.

తను ఉన్మాదిగా అరిచేసరికి హడలిపోయి కాళ్లు పట్టుకున్నాడు ఆ బక్కపీనుగ.

తన కొలీగ్స్ సముదాయించి కూర్చోబెట్టారు. మేనేజర్ అవమానంతో సెలవు పెట్టి వెళ్లిపోయి, ఆ తర్వాత ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్లిపోయాడు.

అప్పట్నుంచి తను ఆఫీసులో అగ్గిపిడుగు. తన దగ్గర పిచ్చి చేష్టలు చెయ్యడానికి ఎవరూ ప్రయత్నించలేదు.

తన ధ్యేయం ఒక్కటే. పిల్లల్ని ప్రయోజకుల్ని చేయాలి.

'వంశీ నువ్వు రాకు. నన్ను డిస్టర్బ్ చెయ్యకు' అనుకుంది అరుణ.

***

కానీ వంశీ వచ్చాడు.

"నిన్ను మర్చిపోలేక నేను పెళ్లి చేసుకోలేదు. ఇష్టం లేని పెళ్లి చేసుకొని మనసొక చోట మనువొక చోటున్నట్లు, భార్యకు న్యాయం చేయలేననిపించింది. నన్ను పిచ్చివాడన్నారు. లోక జ్ఞానం లేనివాడన్నారు. నువ్వు ప్రేమించిన అరుణ పెళ్లి చేసుకొని హాయిగా కాపురం చేయడం లేదా? నీకేమైందని వేళాకోళంగా మాట్లాడారు. కాని నా మనస్సాక్షికి విరుద్ధంగా మరొక అమ్మాయికి తాళి కట్టలేకపోయాను.''

వంశీ మాటలు మౌనంగా వింటోంది అరుణ.

"ఊరెళ్లినప్పుడు మీ అన్నయ్య సుబ్బారావుతో మాట్లాడాను. మా చెల్లెలు ఒప్పుకుంటే మాకేం అభ్యంతరం లేదన్నాడు. దాని జీవితం మళ్లీ చిగురించితే అంతకంటే ఆనందం లేదన్నాడు. మనల్ని వ్యతిరేకించే మీ నాన్న ఇప్పుడు లేనే లేడు. ఏమంటావు అరుణా?" అన్నాడు వంశీ.

"సారీ వంశీ. నాకిప్పుడు మళ్లీ పెళ్లి చేసుకునే వుద్దేశం లేదు. నా పిల్లల్ని ప్రయోజకుల్ని చేయాలి."

"నీ పిల్లల్ని నా పిల్లలుగా చూసుకుంటాను."

"నా అత్త నా మీదే ఆధారపడి వుంది."

"ఆమె మనదగ్గరే వుంటుంది. నా తల్లిలా చూసుకుంటాను. కాదనకు అరుణా!"

"సారీ వంశీ!"

అరుణ తలెత్తి వంశీ కళ్లలోకి సూటిగా చూడలేకపోయింది.

వంశీ నిరాశపడి వెళ్లిపోయాడు.

***

సుబ్బారావు హైదరాబాద్‌కి వచ్చినప్పుడు చెల్లెలికి నచ్చజెప్పాడు.

"నువ్వు వంశీ ప్రపోజల్‌కి వద్దన్నావని బాధపడ్డాడు. వాడు ఇప్పటికీ నిన్ను బాగా ఇష్టపడుతున్నాడు. జరిగిపోయిన దానికి విచారించి ఏం ప్రయోజనం? అదృష్టం వల్ల వంశీ నిన్ను పెళ్లిచేసుకోవడానికి ముందుకొచ్చాడు. మళ్లీ ఇటువంటి అవకాశం నీకు రాదు. నువ్వు ఇంకా చిన్నదానివే! ఇరవై తొమ్మిదేళ్లు. ఎంతో జీవితం వుంది. జీవితాంతం మగతోడు లేకుండా జీవించడం నరకం. మగతోడు లేని ఆడదాన్ని అంతా చిన్న చూపు చూస్తారు. నువ్వీ సంవత్సరంలోనే ఆ విషయం తెలుసుకుంటావు"

"సారీ అన్నయ్యా! నాకెందుకో మళ్లీ పెళ్లి మీద మనసు పోవడం లేదు. పిల్లలు, అత్తగారు నా మీద ఆధారపడ్డారనే విషయం ప్రతి క్షణం నాకు గుర్తొస్తోంది.'' అన్నది అరుణ.

వంశీ అందరిలాంటి వాడు కాదనీ, పిల్లల్ని బాగా చూసుకొంటాడనీ, అత్తగారి బాధ్యత కూడా స్వీకరిస్తాడని ఎంత చెప్పినా అరుణ వినలేదు.

చెల్లెలి మొండి ధోరణికి విసిగి వెళ్లిపోయాడు సుబ్బారావు.

***

మనోహర్‌కి అక్కడేం ఉద్యోగం దొరకడం లేదంటమ్మా! హైదరాబాద్‌లో ఏదొక ఉద్యోగం దొరుకుతుంది. అక్కడికి వచ్చి వెతుక్కుంటాను. వదినతో మాట్లాడమ్మా అని ఫోన్ చేశాడు.'' అన్నది కాంతమ్మ.

అరుణ ఏం మాట్లాడలేదు.

మనోహర్ ఇంటర్ గూడా గట్టెక్కలేదు. ఇక్కడేం ఉద్యోగం దొరుకుతుంది? దొరికినా ఆ చాలీ చాలని ఆదాయంతో ఈ మహానగరంలో ఎట్లా నెట్టుకొస్తాడు?

"అతను చదివిన చదువుకి ఇక్కడేం ఉద్యోగం దొరుకుతుంది అత్తయ్య! అక్కడే ఏదైనా చిన్న వ్యాపారం చేసుకుంటే మంచిది.'' అన్నది అరుణ.




"వ్యాపారం చేయాలంటే డబ్బు కావాలిగా?" అన్నది కాంతమ్మ.

"మనోహర్ అత్తగారి తరపున వాళ్లు సహాయం చెయ్యరా?"

"వాళ్ల పరిస్థితీ అంతంత మాత్రమే. ఇంకా నయం ఆ పిల్ల కాస్త టైలరింగ్ నేర్చుకున్నది కాబట్టి ఇల్లు నడుపుతోంది. మనోహర్‌కే ఏ వ్యాపారం రాదు" అన్నది కాంతమ్మ.

"శ్రద్ధగా నేర్చుకుంటే ఏ విద్యయినా వస్తుంది అత్తయ్య!"

అరుణ చెప్పేది కఠిన వాస్తవమైనా కాంతమ్మ తల్లి హృదయం రాజీపడలేకపోతోంది.

"మనమే ఏదైనా చెయ్యాలి అరుణా!" అన్నది కాంతమ్మ.

"ఏదైనా చూసుకొమ్మని చెప్పండి అత్తయ్యా! మనకి తోచిన సహాయం చేద్దాం" అన్నది అరుణ.

కొన్ని రోజుల తర్వాత అరుణ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే చెప్పింది.

మనోహర్ ఫోన్ చేశాడమ్మా! సెంటర్లో ఒక షాపు చూసుకున్నాడంట. కిరాణా కొట్టు పెట్టుకుంటాడట. ఏభై వేలు సర్దితే సరిపోతుందట" అన్నది.

అరుణకి 'సరే' అనక తప్పలేదు.

మనోహర్ వచ్చి డబ్బు పట్టుకుపోయాడు.

తర్వాత అతగాడి వ్యాపారం ముణ్ణాళ్ల ముచ్చటైంది. కిరాణా కొట్టు నష్టాలతో మూతపడింది.

చెప్పాపెట్టకుండా ఒక రోజు పొద్దున్నే సూట్‌కేస్ పట్టుకొని దిగిపోయాడు మనోహర్.

"బాగున్నావా వదినా!" అని పలకరించాడు.

ఏదైనా పనిమీద వచ్చాడేమో అనుకుంది అరుణ.

అరుణ ఆఫీసుకి బయల్దేరుతుండగా, "వదినా! మనకి వ్యాపారాలు అచ్చిరావడం లేదు. ఇక్కడే ఏదైనా ఉద్యోగం చూసుకొంటా" అన్నాడు.

అరుణ ఏం మాట్లాడలేదు. ఔనని, కాదని అనలేదు. కోడలికి ఇష్టంలేదని కాంతానికి తెలిసిపోతూనే వుంది. కన్న కడుపు, మనోహర్‌ని భరించక తప్పలేదు కాంతమ్మకి.

చెన్న కేశవులు బాగా చదువుకొని గవర్నమెంటు ఉద్యోగం సంపాదించుకున్నాడు. అతని తమ్ముడే అయినా మనోహర్ ఇంటర్ దాటలేకపోయాడు. ఆ వయసులో అతనికి నాటకాల పిచ్చి అంటుకుంది. చదువు మీద, ఏదైనా వృత్తి విద్య మీద శ్రద్ధ లేకుండా పోయింది. పెళ్లయినా స్థిరపడలేకపోయాడు. రకరకాల వ్యాపారాలు చేసినా దేనిలోనూ నిలదొక్కుకోలేకపోయాడు.

హైదరాబాద్‌లో అతని పాత స్నేహితుడి సహాయంతో ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీలో ప్యాకింగ్ సెక్షన్లో వర్కర్‌గా చేరాడు. కాని సినిమాల మీద వ్యామోహం అందులో వేషాలు వెయ్యాలనే పిచ్చి, తెర మీద నటించాలనే కోరిక అతన్ని నేల మీద నిలవనీయడం లేదు. సందుదొరికితే స్టూడియోల చుట్టూ తిరగడం, అసిస్టెంట్ డైరక్టర్లనో, జూనియర్ ఆర్టిస్ట్ ఏజెంట్‌నో వేషాల కోసం దేబిరించడం చేస్తున్నాడు.

"అత్తయ్యా! మనోహర్ ఏదొక ఉద్యోగంలో చేరాడు గదా! వాళ్ల కంపెనీకి దగ్గర్లోనే చిన్న ఇల్లు తీసుకొని ఆ అమ్మాయిని తీసుకొచ్చి కాపురం పెడితే బాగుంటుంది కదా! ఆ కుట్టుకునేదో ఇక్కడే చేసుకుంటుంది" అన్నది అరుణ.

కాంతమ్మ ఈ విషయం కొడుకుతో ప్రస్తావించింది.

ఒకరోజు తాగి వచ్చి గొడవ చేశాడు.

"నా ఒక్కడికి తిండి పెట్టలేరా? నేను భారమయ్యానా? నాకొచ్చే జీతం ఎంత?" అని పెద్దగా కేకలు పెట్టాడు.

అరుణకి అన్నీ వినిపిస్తూనే వున్నాయి.

"కాస్త జీతం పెరిగాక సంసారం పెడతానన్నాడమ్మా! మనోహర్।" అన్నది కాంతమ్మ.

అరుణకి విసుగుపుడుతోంది. ఎంత మరిది అయినా చుట్టపు చూపుగా వచ్చి నాలుగురోజులుండిపోతే అది వేరు సంవత్సరాలు తరబడీ ఇంట్లో తిష్ట వేస్తే ఇరుగు పొరుగు ఏమనుకుంటారు? అనుకుంది.

రాను రాను మనోహర్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. అతని చూపుల్లో గౌరవం లేదు. పరాయి ఆడదాన్ని చూసినట్లు అదోలా చూస్తున్నాడు. అతని కళ్లల్లో కాంక్ష స్పష్టంగా కనిపిస్తోంది.

ఒకరోజు మనోహర్ తాగి వచ్చాడు. అప్పటికి అరుణ నిద్రపోయింది.

ఒక రాత్రి వేళ ఆమె రూమ్‌లోకి వచ్చాడు. అమాంతం మీద పడ్డాడు.అరుణ హడలిపోయి లేచి అతన్ని వదిలించుకొని లైటు వేసింది. మనోహర్ నవ్వుతున్నాడు.

"ఒంటరిగా కోరికలు చంపుకొని ఎన్నాళ్లుంటావు వదినా?" అన్నాడు.

అరుణకి పిచ్చికోపం వచ్చింది. వదినను తల్లిగా భావించి గౌరవించే ఈ దేశంలో మరిది వదిన శరీరం కోరడమా? 'ఛీ' వావివరసలు మరిచిన నీచుడు.

మూలనున్న చీపురు అందుకొని తుక్కురేగకొట్టింది. నోటికొచ్చిన తిట్లు తిట్టింది. కాంతమ్మ అడ్డుపడినా ఆగలేదు. ఆమెను కూడా నెట్టేసింది.

"ఏంటే వూరుకుంటుంటే రెచ్చిపోతున్నావ్? నువ్వేం పతివ్రతవా? ఆఫీసులో ఎందరితో తిరగడం లేదూ! సొంత మరిదే గదా? ఇంట్లో వుంటున్నాడు. వాడి కోరిక తీరిస్తే ఏం పోయింది?"

కాంతమ్మ మాటలు విని అరుణ కొయ్యబారిపోయింది. తన అత్తగారేనా ఈ మాటలు అన్నది అని ఆశ్చర్యపోయింది. కోడల్ని కూతురుగా భావించి కడుపులో పెట్టుకోవాల్సిన అత్తగారేనా మరది పొందు తప్పు లేదంటున్నది.!

మానవ సంబంధాలు ఇంతగా దిగజారిపోయాయా?

ఇదేదో సినిమాలోనో, టీవి సీరియల్లోనో చూస్తే "ఛీ... ఛీ... నిజ జీవితంలో ఇలా ఎవరైనా ప్రవర్తిస్తారా? అటువంటి సంఘటనలు జరుగుతాయా?"అనిపిస్తుంది.

అది తనకే అనుభవంలోకి వస్తే!

అరుణకి పాతాళలోకంలోకి దిగజారిపోతున్నట్టనిపించింది.

ఏడుపు ముంచుకొచ్చింది. వెక్కి వెక్కి ఏడ్చింది. అన్న సుబ్బారావు జ్ఞాపకం వచ్చాడు. 'ఒంటరి ఆడదానికి గౌరవం లేదని ఎంత నిష్ఠుర నిజం చెప్పాడు?' తనే గ్రహించలేకపోయింది.

తను ఎంతసేపూ చుట్టుపక్కల ప్రపంచాన్ని అనుమానించింది కానీ ఇంట్లోనే తోడేలు వున్నట్లు గ్రహించలేకపోయింది.

'ఇప్పుడు నీతో వున్న నీ అత్త ఏదో ఒకరోజు నిన్ను విడిచి పోతుంది. పిల్లలు పెద్దవాళ్లయి, వాళ్ల దారి వాళ్లు చూసుకుంటారు. నువ్వు ఒంటరిదానివై పోతావు. నీ త్యాగం వాళ్లకి గుర్తుండదు. నీ మీద నువ్వే జాలిపడే పరిస్థితి తెచ్చుకోకు.'

అన్న చెప్పిన మాటలు చెవుల్లో మ్రోగుతున్నాయి.

ఆ రాత్రి కాళరాత్రిలా గడిచింది అరుణకు. తెల్లవారకుండానే పిల్లల్ని తీసుకొని పుట్టింటికి బయల్దేరింది అరుణ. అత్తకి మాట మాత్రం చెప్పాలని అనిపించలేదు.

***

సుబ్బారావు వంశీకి ఫోన్ చేశాడు.

"వంశీ అరుణ వూరొచ్చింది. నిన్ను పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుంది. నువ్వు హైదరాబాద్ బ్రాంచీకి ట్రాన్స్‌ఫర్ అవుతానన్నావు కదా! ప్రయత్నించు".

వంశీ ముంబైలో ట్రైన్ ఎక్కాడు. ఎప్పుడెప్పుడు అరుణను చూస్తానా అని ఆరాటపడసాగాడు.

అరుణ వంశీ కోసం ఎదురు చూస్తోంది. ★